క్లుప్తంగా

ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష ఫలితాల వెల్లడి

శంఖవరం: స్థానిక ఆదర్శ పాఠశాల (ఏపీ మోడల్ స్కూల్) ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదలైనట్టు పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణి ఓ ప్రకటనలో తెలిపారు. ఆరో తరగతి ప్రవేశాలకు ఈ నెల 11న పరీక్ష నిర్వహించామన్నారు. ఫలితాల వివరాలు పాఠశాల నోటీస్ బోర్డులో అందుబాటులో ఉంచామన్నారు. అర్హత సాధించిన విద్యార్థులు బుధవారం నుంచి ఆధార్‌కార్డు, ఐదో తరగతి స్టడీ సర్టిఫికెట్ల జెరాక్స్ పాఠశాలలో అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు పాఠశాల సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు.

జలజీవన్ మిషన్ పనుల పరిశీలన

శంఖవరం: గౌరంపేట గ్రామంలో జరుగుతున్న జలజీవన్ మిషన్ పనులను మంగళవారం ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ తేజ పరిశీలించారు. గ్రామంలో రక్షిత తాగునీరు అందించేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమం ప్రారంభించిందన్నారు. నిబంధనలు పాటిస్తూ నిర్ణీత సమయంలో పనులను పూర్తి చేయాలని సూచించారు. సర్పంచ్ రామిశెట్టి ఏసుబాబు, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు సత్కారం



బొద్దవరంలో విద్యార్థులను సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కోటనందూరు: బొద్దవరం హైస్కూల్‌లో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా మంగళవారం విద్యార్థులను సత్కరించారు. గత ఏడాది పది పరీక్షల్లో తొలి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులను సర్పంచ్ వేగి లక్ష్మి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు సత్కరించి మెమెంటో, నగదు బహుమతి అందజేసి అభినందించారు. ప్రణాళిక బద్ధంగా చదువుకొని ఉత్తమ భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వేగి అప్పలనాయుడు, దొడ్డి బాబ్జీ, పీఏసీఎస్ చైర్మన్ మళ్ల శ్రీను, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



మృతుడు సుధాకర్ (ఫైల్)

కిర్లంపూడి: చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన సంఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైనట్టు హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధి గోనేడ గ్రామానికి చెందిన సోలా సుధాకర్(24)ను తన తండ్రి తిట్టాడనే కారణంతో మనస్థాపం చెంది గత 15వ తేదీన కూల్ డ్రింక్‌లో పురుగుల మందు కలుపుకుని సేవించాడు. దీంతో అపస్మారక స్థితిలో పడి ఉన్న సుధాకర్‌ను కుటుంబ సభ్యులు జగ్గంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం కాకినాడ జీజీహెచ్ తరలించగా చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మరణించినట్టు తెలిపారు. మృతుడు తండ్రి సోలా సూరిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ తెలిపారు.

ఆ ఫిర్యాదులో వాస్తవం లేదు

జగ్గంపేట: లోన్ తీసుకోకపోయినప్పటికీ లోన్ యాప్ నిర్వాహకులు తనను బెదిరిస్తున్నారని, దుర్భాషలాడుతున్నారని జగ్గంపేట మండలం భావవరం గ్రామానికి చెందిన వ్యక్తి దిశ ఎస్‌ఓఎస్‌కు సమాచారం అందించాడు. దీంతో దిశ పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం బాధితుడిని విచారించారు. లోన్ యాప్ ద్వారా లోను తీసుకోలేదని బాధితుడు తెలిపాడు. అయితే తమ విచారణలో సత్యనారాయణ ఫైనాన్స్ కంపెనీ నుంచి సొమ్ము తీసుకున్నట్టు తెలిసిందని జగ్గంపేట సీఐ సూర్య అప్పారావు తెలిపారు. సత్యనారాయణ చెపుతున్న సమాచారంలో వాస్తవం లేదన్నారు. దీనిపై ఎటువంటి కేసు నమోదు చేయలేదని ఆయన వివరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రత్తిపాడు: స్థానిక జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన జరిగింది. స్థానిక పోలీసుల కథనం మేరకు తమిళనాడు రాష్ట్రం సేలం గ్రామానికి చెందిన ముత్తురాజు అంగుస్వామి (50) కారులో విశాఖపట్నం వెళ్తున్నారు. గుర్తుతెలియని వాహనం కారును వెనుక భాగాన ఢీకొంది. ఈ సంఘటనలో ముత్తురాజు అంగుస్వామి అక్కడికక్కడే మృతి చెందారు. డ్రైవర్ మణి చిన్నదొర ప్రాణాలతో బయటపడ్డాడు. మృతదేహాన్ని శవపరీక్ష కోసం స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. వీఆర్వో మళ్ళ శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రత్తిపాడు ఎస్సై ఎం.పవన్‌కుమార్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఏడు లీటర్ల సారాతో ఇద్దరి అరెస్టు

ప్రత్తిపాడు: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) పరిధిలోని వివిధ గ్రామాల్లో మంగళవారం దాడులు నిర్వహించి, ఏడు లీటర్ల సారాతో ఇద్దరిని అరెస్టు చేసినట్టు స్థానిక ఎస్‌ఈబీ సీఐ పి.అశోక్ తెలిపారు. టి.రాయవరం గ్రామంలో రెండు లీటర్ల సారాతో దొంగల సూర్యకాంతంను, స్పందనలో వచ్చిన ఫిర్యాదు మేరకు ఉద్దండ జగన్నాథపురంలో దాడులు నిర్వహించి, ఐదు లీటర్ల సారాతో కార్తీక సత్తిబాబును అరెస్టు చేశామన్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు స్థానిక సీఐ తెలిపారు.

వెరీ డ్యామేజ్

- శిథిలావస్థకు చేరిన సాగునీటి చెక్ డ్యాంలు
- ఏళ్లు గడచిన జరగని అభివృద్ధి పనులు

రౌతులపూడి: వందలాది ఎకరాల పంట పొలాలకు నీరందించే సాగునీటి చెక్‌డ్యాంలు అభివృద్ధికి నోచుకోలేదు. శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా మారాయి. చెక్‌డ్యాంలు శిథిల స్థితికి చేరి ఏళ్లు గడుస్తున్న అధికారులు పట్టించుకోవడంలేదు. దీంతో సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వంలో నీరు–చెట్టు పథకంలో మంజూరైన పనులను ప్రారంభించడానికి నాయకులు ఆర్భాటంగా చేపట్టిన శంకుస్థాపనలు నేటికీ శిలాఫలకాలుగా దర్శనమిస్తున్నాయి. చెక్‌డ్యాంలను బాగుజేయాలని ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా కనీసం పట్టించుకోవడంలేదని రైతులు వాపోతున్నారు.

వర్షం నీరు వృథా

చెక్‌డ్యాంలు పూర్తిగా శిథిలమై ఏటా కొండకాలువలు, ఏటి కాలువల నుంచి వచ్చేనీరు వృథాగా పోతుంది. ఎగువ ప్రాంతాల్లోంచి వచ్చిన నీటిని పొదుపు చేసేందుకు ఇంకుడు గుంటలు, పారంపాండ్లు అంటూ ఎన్నో నిరుపయోగ నిర్మాణాలకు గత ప్రభుత్వం రూ.లక్షలాది రూపాయలు వెచ్చించి, పంట పొలాలకు సాగునీరందించే చెక్‌డ్యాంలను మాత్రం అభివృద్ధి చేయలేదని రైతులు వాపోతున్నారు.

నిధులు మంజూరైనా..

రౌతులపూడిలో రైతుల పంట భూములు సాగు చేసుకునేందుకు అవసరమైన బల్లకట్టు, బంగారు కట్టు, ఇసక కట్టు, సత్రం కాలువ అభివృద్ధికి నాలుగేళ్ల క్రితం రూ.3 కోట్లకుపైగా నిధులు వెచ్చించి అప్పట్లో మంజూరు చేశారు. ఈ మేరకు వాటి అభివృద్ధి పనులు ప్రారంభించడానికి అట్టహాసంగా అప్పటి ఉప ముఖ్యమంత్రి, హోం మంత్రి నిమ్మకాయల చినరాజప్పతో వాటి నిర్మాణాలకు శంకుస్థాపన కూడా చేశారు. తప్ప ఏవిధమైన పనులు ప్రారంభించలేదని రైతులు తీవ్రంగా మండిపడ్డారు.

శిథిలమైన చెక్‌డ్యాంలు ఇవే..

మండలంలో సుమారు మూడు వందల ఎకరాలకు సాగునీరందించే బల్లకట్టు, ఇసక కట్టు, సత్రం కాలువ గట్టు, పి.చామవరంలోని మద్దిల చెరువు చెక్‌డ్యాం, అదే గ్రామంలోని గుర్రపు చెరువుగట్టు పొర్లుడ్యాం శిథిలావస్థకు చేరాయి. బలరామపురంలోని వెంకమ్మ చెరువు పొర్లుడ్యాం, స్లూయిజ్, ఎ.మల్లవరంలోని ఎర్రచెరువు గట్టు పొర్లుడ్యాం నిరుపయోగంగా మారాయి. వీటితోబాటు ఉప ప్రణాళికా ప్రాంతంలోని ఐటీడీఏ ఆధ్వర్యంలో సుమారు 20 ఏళ్ల క్రితం నిర్మించిన రాఘవపట్నం, సార్లంక, జల్దాంలోని సాగునీటి చెక్‌డ్యాంలు కూడా నిరుపయోగంగా మారాయి. ఇప్పటికైనా అధికారులు చెక్‌డ్యాంలను పటిష్ట పరిచేందుకు శాశ్వత ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



రౌతులపూడిలో శిథిలమైన బల్లకట్టు



శిథిలావ్యస్థలోవున్న ఎ.మల్లవరంలో ఎర్రచెరువు పొర్లుడ్యాం

ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా..



300 ఎకరాలకు పైగా సాగునీరందించే ఎర్ర చెరువు పొర్లుడ్యాం శిథిలమై ఆరేళ్లు అవుతున్నా ఎవరూ పట్టించుకోలేదు. ఆయకట్టు రైతులకు పూర్తిగా నీరందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. శిథిలమైన పొర్లుడ్యాంను బాగుజేయాలని ఇరిగేషన్ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేదు. ఇప్పటికైనా అధికారులు నీరు వృథా కాకుండా పట్టించుకోండి.

–కాకి చిన్న రైతు, ఎ.మల్లవరం

చెక్‌డ్యాంలు పరిశీలిస్తాం



మండలంలోని శిథిలావ్యస్థలో ఉన్న సాగునీటి చెక్‌డ్యాంలను సంబంధిత ఇరిగేషన్, వ్యవసాయ అనుబంధ సంస్థ అధికారులతో కలిసి పరిశీలించి అభివృద్ధి చర్యలు చేపడతాం. వీటిపై జిల్లా ఉన్నతాధికారులకు నివేదించి అవసరమైన మేరకు శాశ్వత ప్రాతిపదికన పటిష్ఠ చర్యలు చేపడతాం.

–ఎం.గోవిందు, ఎంపీడీఓ రౌతులపూడి

జగనన్న పాలవెల్లువపై అవగాహన

రౌతులపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న పాలవెల్లువ పథకంతో రైతులకు మంచి లాభాలు చేకూరుతాయని మండల వెటర్నరీ అధికారి ఎం.వీర్రాఘవరావు అన్నారు. మండలంలోని పి.చామవరం, పారుపాక గ్రామాల్లో మంగళవారం జగనన్న పాలవెల్లువపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మిగిలిన ప్రైవేటు పాలకేంద్రాలు కంటే లీటరు పాలుపై 5 శాతం ధర వేస్తామన్నారు. గ్రామాల్లో నెలకొల్పే జగనన్న పాలవెల్లువ(పాల కేంద్రాలు)ను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రత్తిపాడు జగనన్న పాలవెల్లువ పథకం రూట్ అధికారి, సర్పంచ్ పక్కుర్తి లక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు జి.వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గుర్రంపాలెంలో పాల డెయిరీ ప్రారంభం

జగ్గంపేట: గుర్రంపాలెం గ్రామంలో మంగళవారం అమూల్ పాల డెయిరీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పశుసంవర్ధక శాఖ వైద్యాధికారి వినోద్‌కుమార్ మాట్లాడుతూ అమూల్ పాల డెయిరీ సహకార సంఘం పేరుతో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సరికొత్త పథకాన్ని ప్రారంభించారని తెలిపారు.ఈ పథకంలో విధి విధానాలు ఆయన వివరించారు. డాక్టర్ జీఎస్‌పీ ప్రసాదరావు, పంచాయతీ సెక్రటరీ తోటదేవి, వైస్ ఎంపీపీ నక్క శ్రీను, వైఎస్సార్ సీపీ నేతలు పడాల విష్ణు, చీపురుపల్లి రాఘవ, రైతులు పాల్గొన్నారు.



పారుపాకలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వీర్రాఘవరావు

'జగనన్న సురక్ష'ను విజయవంతం చేద్దాం

తుని రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న జగనన్న సురక్ష పథకం అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో విజయవంతం చేద్దామని ఎంపీపీ బొప్పన రాము అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ జగనన్న సురక్ష పథకాన్ని గ్రామీణ ప్రజలకు చేరువ చేసేందుకు మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్టు ఎంపీడీఓ పి.రవికుమార్ తెలిపారు. జూలై ఒకటో తేదీ నుంచి 28 వరకూ ప్రత్యేక బృందాల ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహిస్తామన్నారు. తహసీల్దార్ ఎల్.శివకుమార్, వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతల రమణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 'జగనన్న సురక్ష' కార్యక్రమ నిర్వాహణపై రెండు రోజులుగా వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లకు జరుగుతున్న అవగాహన తరగతులు మంగళవారంతో ముగిశాయి. ముగింపు సందర్భంగా ఏర్పాటైన సభలో ఎంపీపీ గోళ్ళ కాంతి సుధాకర్, ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో వలంటీర్లకు విధి విధానాలను వివరించారు. గ్రామ సర్పంచ్ గుడాల విజయలక్ష్మి, తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణ, ఈఓఆర్డీ కేవీవీఎస్ కాశీ విశ్వనాథం, పంచాయతీ కార్యదర్శి ద్విభాష్యం శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పథకం నిర్వహణపై మాట్లాడుతున్న ఎంపీపీ రాము

డ్రైన్ నిర్మాణానికి భూమిపూజ



ఏలేశ్వరంలో భూమిపూజ చేస్తున్న నాయకులు

ఏలేశ్వరం: పట్టణ పరిధిలోని 12వ వార్డులో డ్రైన్ నిర్మాణానికి మంగళవారం భూమిపూజ చేశారు. వార్డు పరిధిలోని తోటవీధిలో గడపగడపకూ మన ప్రభుత్వం నిధులు రూ.1.77 లక్షలతో డ్రైన్ పనులు ప్రారంభించనున్నారు. దీనికి వైఎస్సార్ సీపీ నేత, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ సామంతుల సూర్యకుమార్ భూమిపూజ చేశారు. గడపగడపకూ మన ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కావడంతో ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ ఆదేశాల మేరకు డ్రైన్ నిర్మిస్తున్నట్టు సూర్యకుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ పైల విజయ్‌కుమార్, సొసైటీ త్రిసభ్య కమిటీ సభ్యుడు సిరిపరపు రాజేష్, కోరాడ ప్రసాద్, జామి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

2501 మట్టి నమూనాల సేకరణ లక్ష్యం

తుని రూరల్: వ్యవసాయశాఖ తుని సబ్‌డివిజన్ పరిధిలో 2501 మట్టి నమూనాల సేకరణ లక్ష్యంగా నిర్దేశించినట్టు సహాయ సంచాలకులు సుంకర బుల్లిబాబు తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో ఏడీఏ బుల్లిబాబు విలేకర్లతో మాట్లాడారు. ఖరీఫ్ సీజన్‌కు తుని మండలంలో 732, తొండంగిలో 510, కోటనందూరులో 470, శంఖవరంలో 276, రౌతులపూడి మండలంలో 513 మట్టి నమూనాలు సేకరించాలన్నారు. మట్టి నమూనాల సేకరణ ఇప్పటికే ప్రారంభమైందని, పరీక్షా ఫలితాలు ఆధారంగా భూసారం పెంపునకు చర్యలు తీసుకుంటామన్నారు. మట్టి నమూనాల సేకరణకు రైతులు సహకరించాలన్నారు.

మెట్రోపాలిటిన్ న్యాయమూర్తిగా నారాయణమూర్తి

తుని: స్థానిక బార్ అసోసియేషన్‌లో 20 ఏళ్ల పాటు న్యాయవాదిగా పని చేసిన పెంటపాటి నారాయణమూర్తి విశాఖపట్నం నాలుగో స్పెషల్ మెట్రోపాలిటిన్ కోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. మంగళవారం న్యాయమూర్తిగా విధుల్లో చేరినట్టు ఒక ప్రకటనలో తెలిపారు. తుని మండలం కొలిమేరుకు చెందిన నారాయణమూర్తి తుని కోర్టులో న్యాయవాదిగా పని చేస్తున్నారు. హైకోర్టుకు చేసుకున్న దరఖాస్తు మేరకు అన్ని పరిశీలించిన తర్వాత న్యాయమూర్తిగా నియమిస్తూ ఉత్తర్వును జారీ చేసినట్టు విశాఖపట్నం డిస్ట్రిక్ సెషన్ జడ్జి ఆలపాటి గిరిధర్ నియామకపత్రంలో పేర్కొన్నారు. రెండేళ్ల పాటు పదవి ఉంటానని నారాయణమూర్తి తెలిపారు. తుని బార్ అసోసియేషన్ సభ్యులు అభినందనలు తెలిపారు.

తిరుమలాయపాలెంలో కేవీపీఎస్ నాయకుడి పర్యటన

గోకవరం: తిరుమలాయపాలెం గ్రామంలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు జువ్వల రాంబాబు మంగళవారం పర్యటించారు. ఇటీవల గ్రామంలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు తదనంతరం విగ్రహం తొలగింపులో తలెత్తిన ఉద్రిక్తతలో గాయపడిన బోయిడి మహాలక్ష్మి, సబ్బలక్ష్మి తదితరులను ఆయన పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ ఈ ఘటనపై ప్రభుత్వం వెంటనే స్పందించి దళితులకు రక్షణ కల్పించడమే కాకుండా అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించిన స్థానంలో తిరిగి ప్రతిష్ఠించాలని డిమాండ్ చేశారు. ప్రసన్నకృష్ణ, జయరాజ్ శ్రీనివాస్, ఎడ్ల సుధాకర్, జి.మణికంఠ, సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యం

ప్రత్తిపాడు రూరల్: ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం డీఆర్‌డీఏ ద్వారా పలు కార్యక్రమాలను నిర్వహిస్తుందని డీఆర్‌డీఏ పీడీ పీడీ కె.శ్రీరమణి అన్నారు. మండలంలోని కొండపల్లి, బురదకోట, బాపన్నదార, కె.మిర్తివాడ గిరిజన గ్రామాల్లో మహిళలతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలను, పొందుతున్న జీవనోపాధిని అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు చింతల రాజు, డీపీఎంలు రాయ్, బాబురావు, సీసీలు శ్రీను, కార్తిక్, సిబ్బంది పాల్గొన్నారు.

శివారు ప్రాంతాలకు రహదారి సదుపాయం

తుని: పట్టణ పరిధిలోని శివారు ప్రాంతాలకు రహదారుల సదుపాయాలను కల్పిస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. మంగళవారం ఒకటో వార్డు నవజీవన్‌నగర్‌లో రూ.15 లక్షలు, 7వ వార్డు కంకిపాటి వారి గరువులో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్లకు ఆమె కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా దృష్టికి సమస్యను తీసుకురావడంతో నిధులు మంజూరు చేసి త్వరలోనే పనులు పూర్తి చేస్తామన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గం అధ్యక్షుడు ఏలూరి బాలు, తుని పట్టణశాఖ పార్టీ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, గాంధీసత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, జిల్లా వక్ఫ్ బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, కమిషనర్ ప్రసాదరాజు, ఆయా వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.



కంకిపాటి వారి గరువులో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సీపీ సుధారాణి, నాయకులు

ఫుడ్ ప్రోసెసింగ్ యూనిట్లతో ఆదాయం

తుని రూరల్: ఉద్యాన పంటలకు అనుబంధంగా ఫుడ్ ప్రోసెసింగ్ యూనిట్లు నెలకొల్పి రైతులు ఆదాయం పొందవచ్చని కాకినాడ జిల్లా ఉద్యాన అధికారి నేతల మల్లికార్జునరావు అన్నారు. మంగళవారం తేటగుంటలో హెచ్ఓ గుత్తుల విజయలక్ష్మితో కలసి ఆయన పర్యటించారు. ఇటీవల సంభవించిన ఈదురు గాలులు, భారీవర్షాలకు దెబ్బతిన్న అరటి, కొబ్బరి, జీడిమామిడి, మామిడి, ఆయిల్‌పామ్ తదితర ఉద్యాన తోటలను పరిశీలించారు. రైతు సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొబ్బరి నిల్వ కేంద్రాలను పరిశీలించి, రైతులతో మాట్లాడారు. పలు సూచనలు చేశారు. తేటగుంట సర్పంచ్ అత్తి నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

వర్షాలకు దెబ్బతిన్న పంటల పరిశీలన

తొండంగి: బెండపూడిలో ఇటీవల గాలివానలకు దెబ్బతిన్న పంటలను జిల్లా ఉద్యాన అధికారి మల్లికార్జునరావు మంగళవారం పరిశీలించారు. బాధిత రైతులతో మాట్లాడి నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. రైతు ఉత్పత్తిదారు సంఘాలకు 75 శాతం రాయితీపై ఇచ్చిన పంట సేకరణ కేంద్రాలను పరిశీలించారు. పంటల పరిస్థితి అడిగి తెలుసుకుని కొబ్బరి, మామిడిలో విలువ ఆధారిత తయారీని రైతులకు వివరించారు. తుని ఉద్యాన అధికారి విజయలక్ష్మి, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

రెండో ఎంఈఓల బాధ్యతల స్వీకరణ

కిర్లంపూడి: మండల ఎడ్యుకేషన్ అధికారి(ఎంఈఓ)–2గా మక్కా చిన్నారావు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. కాజులూరు మండలం, కుయ్యేరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధాన ఉపాధ్యాయుడిగా ఆయన విధులు నిర్వహించారు. ఇటీవల జరిగిన ఎంఈఓ–2 కౌన్సిలింగ్‌లో కిర్లంపూడి మండలానికి బదిలీ అయ్యారు.

తొండంగి మండలం

తొండంగి: మండల ఎంఈఓ–2గా అనిశెట్టి వెంకట సుబ్బిరెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం కె.పెరుమాళ్లపురంలో జీహెచ్ఎంగా పని చేస్తున్న సుబ్బిరెడ్డి ఎంఈఓ–2గా ఇక్కడకు వచ్చారు. సుబ్బిరెడ్డికి స్థానిక ఎంఈఓ షేక్ బాజ్జీ, ఉపాధ్యాయులు, ఎంఈఓ కార్యాలయ సిబ్బంది శాలువ, పూలమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

కోటనందూరు మండలం

కోటనందూరు: మండల ఎంఈఓ–2గా తుని మండలం కేఓ మల్లవరం హైస్కూల్ ప్రధానోపాధ్యాయులుగా పని చేసిన రామశేఖర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనను స్థానిక ఎంఈఓ ఏవీఎస్ శ్రీనివాస్, యూటీఎఫ్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, ఎంఈఓ కార్యాలయ సిబ్బంది శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాప్రతినిధులు, ఎంఈఓ శ్రీనివాస్, సిబ్బంది సహకారంతో విద్యార్థులకు మెరుగైన సేవలందిస్తానని రామశేఖర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అందుబాటులోకి తీసుకొచ్చిన ఎంఈఓ–2 పోస్టుల్లో భాగంగా ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు.

మాదిగల అభివృద్ధికి కృషి

అన్నవరం: రాష్ట్రంలో మాదిగల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎంతగానో కృషి చేస్తున్నారని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. మంగళవారం అన్నవరంలో ప్రత్తిపాడు మార్కెట్ యార్డు డైరెక్టర్ పలివెల శ్యామల, వైఎస్సార్ సీపీ నాయకుడు పలివెల సతీష్ ఆధ్వర్యంలో మాదిగలు ఆయనను ఘనంగా సన్మానించారు. తొలుత ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ స్థానిక మాదిగపేట వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ హయాంలో ఎస్సీలను అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హీనంగా చూశారని విమర్శించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అటు సంక్షేమ పథకాలతోపాటు, ప్రభుత్వ పదవుల్లో పెద్దపీట వేసి, అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. మార్కెట్ యార్డు డైరెక్టర్ పలివెల శ్యామల కూడా ప్రసంగించారు. అనంతరం ఎమ్మెల్సీ ఇజ్రాయిల్, పలివెల శ్యామల, పలివెల సతీష్‌లను మాదిగ సామాజిక వర్గ నాయకులు ఘనంగా సన్మానించారు. సర్పంచ్ శెట్టిబత్తుల కుమార్ రాజా, ఎంఆర్‌పీఎస్ నాయకులు అరుగుల మోషే, పల్లెటి ప్రేమ సాగర్, పలివెల కామరాజు, గంపల అన్నవరం, లోవరాజు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ ఇజ్రాయిల్, పలివెల శ్యామల, సతీష్‌లను సన్మానిస్తున్న మాదిగ సామాజికవర్గ నాయకులు

భక్తురాలి సెల్‌ఫోన్ అందజేత

అన్నవరం: సత్యదేవుని హుండీలో కానుకలు సమర్పిస్తుండగా పడిపోయిన ఒక భక్తురాలి సెల్‌ఫోన్‌ను ఆమె అభ్యర్థన మేరకు మంగళవారం తిరిగి అందజేశారు. వివరాల్లోకి వెళితే.. ఈ నెల మూడో తేదీన విశాఖపట్నానికి చెందిన అనూరాధ సత్యదేవుని ఆలయానికి బంధువులతో కలిసి వచ్చారు. ఆమె స్వామివారి దర్శనం అనంతరం హుండీలో కానుకలు వేస్తుండగా పొరబాటున ఆమె సెల్‌ఫోన్ పడిపోయింది. ఈ విషయాన్ని ఆమె దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్‌కు అదే రోజు లిఖిత పూర్వకంగా తెలియజేశారు. మంగళవారం స్వామివారి హుండీ ఆదాయం లెక్కింపు సమయంలో లభించిన ఆ సెల్‌ఫోన్‌ను తీసి వివరాలను అనూరాధను అడిగి, అనంతరం అకౌంట్స్ విభాగ ఏఈఓ ఆనందకుమార్ దానిని అందజేశారు.

పిల్లలపై అప్రమత్తంగా వ్యవహరించాలి

తుని: మాదక ద్రవ్యాలు, సైబర్ నేరాలబారిన పడుతున్న పిల్లలపై తల్లిదండ్రులు అప్రమత్తంగా వ్యవహరించాలని పెద్దాపురం డీఎస్పీ కె.లతాకుమారి సూచించారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు మంగళవారం సాయంత్రం పట్టణంలోని బ్యాంకు కాలనీలో వారధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఎస్పీ లతాకుమారి మాట్లాడుతూ ప్రజలకు, పోలీసులకు మధ్య సంబంధాలు పెంపొందించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. పిల్లలను గంజాయి, మాదక ద్రవ్యాలు, సైబర్‌నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కలిదిండి సత్యనారాయణరాజు, కౌన్సిలర్ చింతకాయల భారతి, పట్టణ సీఐ నాగదుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

గండేపల్లి: అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచనున్నట్టు డీఎస్పీ కె.లతాకుమారి పేర్కొన్నారు. మంగళవారం గండేపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాలలో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని, దొంగతనాలు, రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలు ఇచ్చారు. ఈమె వెంట జగ్గంపేట సీఐ బి.సూర్య అప్పారావు, గండేపల్లి, జగ్గంపేట, కిర్లంపూడి ఎస్సైలు వై.గణేష్ కుమార్, సీహెచ్ విద్యాసాగర్, రఘునాథరావు, సిబ్బంది ఉన్నారు.

బీమా సొమ్ము అందజేత

గోకవరం: గ్రామంలో సచివాలయం–2 పరిధిలో నివాసం ఉంటున్న పొట్నూరి మురారి ఇటీవల మృతి చెందగా ఆయన భార్య కాంతమ్మకు మంగళవారం వైఎస్సార్ బీమా పథకంలో తక్షణ సహాయంగా రూ.10 వేలు వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు అందజేశారు. పథకంలో మిగిలిన రూ.90 వేలు నగదు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ అవుతుందని తెలిపారు. పార్టీ నాయకుడు తోలేటి రాంప్రసాద్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ట్రాఫిక్‌కు మామిడి రైతులు సహకరించాలి

తుని: పట్టణంలోని మార్కెట్ యార్డు వద్ద సూరవరం రోడ్డులో మామిడి రైతులు విక్రయాలు స్వేచ్ఛగా జరుపుకోవచ్చునని, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా సహకరించాలని తుని పట్టణ సీఐ ఎం.నాగ దుర్గారావు కోరారు. మంగళవారం ఆయన విలేకురులతో మాట్లాడారు. కొందరు సోషల్ మీడియాలో మామిడి రైతులపై పోలీసులు ఓవరాక్షన్ అంటూ ప్రచారం చేయడాన్ని ఆయన ఖండించారు. ప్రస్తుతం కళాశాలలు, స్కూళ్లు తెరవడంతో బస్సులు, విద్యార్థులు వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నారన్నారు. కొందరు రైతులు మామిడి పండ్ల ట్రేలు రోడ్డుపై పెట్టడంతో పోలీసులు జోక్యం చేసుకుని వాటిని జరిపారని, దీనిపై వారు పోలీసులతో వాగ్వివాదానికి దిగారన్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు.

విశ్రాంతి షెడ్డులో కుళాయిల ఏర్పాటు

అన్నవరం: సత్యదేవుని దర్శనం కోసం పశ్చిమ రాజగోపురానికి వెళ్లే వై జంక్షన్ వద్ద ఉన్న విశ్రాంతి షెడ్డులో భక్తులకు మంచినీటిని సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తుల కోసం ఇక్కడ మూడు నెలల క్రితం విశ్రాంతి షెడ్డు నిర్మించిన విషయం విదితమే. అయితే ఇక్కడ తాగునీరు లేకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. దీంతో ఈనెల 17వ తేదీన సాక్షి దినపత్రికలో ×అగ్ని గుండంగా మారిన రత్నగిరి । శీర్షికన ప్రచురితమైన వార్తలో విశ్రాంతి షెడ్డులో మంచినీరు లేక భక్తులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. దీనికి స్పందించిన ఈఓ చంద్రశేఖర్ అజాద్ వెంటనే మంచినీరు అందించే ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. దీంతో అక్కడ రెండు మంచినీటి కుళాయిలను ఏర్పాటు చేయడానికి అవసరమైన ఏర్పాట్లు చేశారు. మరో రెండ్రోజుల్లో కుళాయిలు బిగిస్తామని అధికారులు తెలిపారు.

పశుబీమాతో రైతులకు భరోసా

ప్రత్తిపాడు రూరల్: వైఎస్సార్ పశు బీమా పథకంతో పాడి రైతులకు కొండత భరోసా కల్పించిందని పశుసంవర్ధక శాఖ జేడీ ఎస్.సూర్యప్రకాశరావు అన్నారు. ప్రత్తిపాడులో పశుసంవర్ధకశాఖ ప్రాంతీయ కార్యాలయంలో వైఎస్సార్ పశుబీమా పథకంపై అవకాగహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ పాడి రైతులు నష్టపోకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రభుత్వం వైఎస్సార్ పశుబీమా పథకాన్ని అమలు చేస్తుందన్నారు. ప్రభుత్వం జులై ఒకటి నుంచి అమూల్ సంస్థ ద్వారా పాలసేకరణ చేపడుతుందన్నారు. దీని కోసం జిల్లాలో 200 గ్రామాలను ఎంపిక చేసిందన్నారు. జిల్లాలో పనసపాడు, గంగనాపల్లి, నేమాం, తునిలలో బల్క్ మిల్క్ కూలింగ్ (బీఎంసీ) కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో విస్తృతంగా వాక్సినేషన్ కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ ఏడీ చిక్కం బాలచందర్ యోగేశ్వరరావు, పశువైద్యాధికారులు మంజుష, సత్యరాజేశ్వరి, సతీష్, ఏహెచ్ఏలు, గోపాలమిత్రాలు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



వెదురుపాకలో గొర్రెలకు ట్యాగ్‌లు వేస్తున్న వెంకటేశ్వర్లు

పశుబీమా పథకాన్ని వినియోగించుకోండి

గోకవరం: వెదురుపాక గ్రామంలో మంగళవారం వైఎస్సార్ పశుబీమా పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాజమహేంద్రవరం పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బీమా గురించి పాడి రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం గొర్రెలకు బీమా ట్యాగ్‌లు వేశారు. అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పి.ప్రభావతి, వెటర్నరీ అసిస్టెంట్ కె.అనిత, పి.కృష్ణవేణి, సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

రాయితీపై వ్యవసాయ పరికరాలు

గండేపల్లి: రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై రైతులకు వ్యవసాయ పరికరాలు అందజేయనున్నట్టు ఉద్యానశాఖ అధికారి పి.లావణ్య తెలిపారు. డ్రిప్, స్ప్రింక్లర్లు అందుబాటులో ఉన్నాయని, వివిధ ఉద్యాన పంటలకు ఉపయోగపడే వీటిని సొంత భూమి ఉన్న రైతులు తమ ఆధార్, అడంగల్, బ్యాంక్ అకౌంట్ జెరాక్స్‌లతో సంబంధిత ఆర్‌బీకేల వద్ద సంప్రదిస్తే లబ్ధిదారుల పేరున రిజిస్ట్రేషన్ చేసి, తనిఖీ అనంతరం పరికరాలను అందజేస్తారన్నారు. ఐదు ఎకరాల లోపు గల రైతులకు 90 శాతం రాయితీ, ఐదు ఎకరాలు పైబడిన రైతులకు 70 శాతం రాయితీ వర్తిస్తుందని వివరించారు.